క్లుప్తంగా

శివాలయంలో ఆకాశ దీప కాంతులు



మానం ఆంజనేయులు నగర్‌లోని ఆలయంలో ఆకాశ దీపం

మధురవాడ: మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ వద్ద మానం ఆంజనేయులు నగర్‌లో కొలువైన శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహాకామేశ్వర స్వామి దేవాలయం వద్ద గురువారం ఆకాశ దీపాలు వెలిగించారు. కమిటీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, ఇతర సభ్యుల పర్యవేక్షణలో అర్చకులు ఆకాశ దీపం ఏర్పాటు చేశారు. కార్తీక దామోదర నినాదాలతో ప్రాంగణం మార్మోగింది.

నిలిచిన చేపల వేట



మంగమారిపేట వద్ద ఎగసి పడుతున్న కెరటాలు

కొమ్మాది: తుఫాన్ నేపథ్యంలో భీమిలి తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఉప్పాడ, మంగమారిపేట, తిమ్మాపురం మత్స్యకారులు వేటకు విరామం ఇచ్చారు. ఈదురు గాలులు బలంగా వీయడం, సముద్ర కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడుతుండటంతో మత్స్యకారులు ఇప్పటికే అప్రమత్తమయ్యారు. మత్స్యకారులను వేటకు వెళ్లవద్దన్న అధికారుల ఆదేశాల మేరకు ఇంటికే పరిమితమయ్యారు.

తిరువీధుల్లో శ్రీవారు

- ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు



తిరువీధుల్లో శ్రీవారి ఊరేగింపు

కొమ్మాది: రుషికొండ శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయ తిరువీధుల్లో వైకుంఠధాముడు శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. నాలుగు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు గురువారం సాయంత్రం కనులపండువగా ముగిశాయి. ముగింపోత్సవాల సందర్భంగా ఉత్సవ మూర్తులను మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ఊరేగించారు. అనంతరం యాగంలో పూర్ణాహుతి సమర్పించారు. వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఏఈవో జి.జగన్మోహనాచార్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రూ.10 లక్షల జెడ్పీ నిధులతో 9 బోరు బావులు



అనంతవరంలో బోరు బావి తవ్వకం పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని తొమ్మిది పంచాయతీల్లో తొమ్మిది బోరు బావుల నిర్మాణానికి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు కృషితో జిల్లా పరిషత్ అభివృద్ధి నిధులు రూ.10లక్షలు మంజూరయ్యాయని ఎంపీపీ కంటుబోతు రాంబాబు తెలిపారు. మండలంలోని అనంతవరంలో గురువారం బోరు బావి తవ్వకం పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఈ తొమ్మిది బోరు బావుల్లో అనంతవరానికి ఒకటి మంజూరైందని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిలపర్తి సత్యనారాయణ, గొర్రిపాటి పెద ఎర్నాయుడు పాల్గొన్నారు.



వారం రోజుల క్రితం తాటితూరు వద్ద నదిని దాటుతున్న స్థానికులు



నది నుంచి తాటితూరు కళ్లాల వద్దకు చేరుకునే మార్గం



రాకపోకలకు మార్గం కోసం సిద్ధం చేసి ఉంచిన ఇసుక బస్తాలు



ప్రస్తుతం మట్టి కప్పడంతో దానిపై నుంచి విద్యార్థుల రాకపోకలు

చినుకు పడితే ఆ విద్యార్థుల చదువుకు బ్రేక్ పడాల్సిందే. ప్రస్తుతం నదిలోని తాత్కాలిక కాలిబాటపై వస్తున్న వారంతా వానొస్తే బడికి డుమ్మా కొట్టేస్తారు. మళ్లీ నదిలో నీటి ప్రవాహం తగ్గేవరకు నిరీక్షించాల్సిందే. గ్రామస్తులు కూడా నదిలోనుంచే రాకపోకలు సాగిస్తున్నారు. నదిపై వంతెన నిర్మిస్తే తమ కష్టాలు గట్టెక్కుతాయని.. ప్రభుత్వం, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చినుకు పడితే చదువుకు బ్రేక్

- రోజూ నదిని దాటి పాఠశాలకు వస్తున్న విద్యార్థులు
- 'గోస్తని'లో రాళ్లు, కాలిబాట ఏర్పాటు చేసుకుని రాకపోకలు
- వానొస్తే విద్యార్థులకు తప్పని అవస్థలు
- వంతెన నిర్మాణానికి రెండు మండలాల ప్రజల విన్నపాలు



సాధారణ రోజుల్లో రాళ్ల సాయంతో నది దాటుతున్న విద్యార్థులు



నదిలో నుంచి ద్విచక్ర వాహనంపై పయనం

తగరపువలస:

పద్మనాభం మండలం పొంద్రంగి పంచాయతీ సామియ్యవలస గ్రామానికి చెందిన సుమారు 60 మంది విద్యార్థులు భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్లో చదువుతున్నారు. వీరంతా నిత్యం సామియ్యవలస, తాటితూరు కళ్లాల వద్ద గోస్తని నదిలోకి నాటు బండ్లు ప్రవేశించే మార్గం ద్వారా హైస్కూల్‌కు రాకపోకలు సాగిస్తారు. ప్రస్తుతం నదిలో మూడుచోట్ల రెండు అడుగుల నీటిలో నుంచి వీరు రాకపోకలు సాగిస్తున్నారు. ఒకచోట విద్యార్థులు బూట్లు తడవకుండా రాళ్లు ఏర్పాటు చేసుకోగా, మరొక చోట తాటితూరు వాసులు తాత్కాలికంగా కాలిబాట ఏర్పాటు చేసుకుని నడకదారిన వెళ్తున్నారు. మిగిలిన చోట్ల గ్రావెల్ ఆధారంగా చదును చేసిన మార్గంలో నదిని దాటుతుంటారు.

వందలాది మంది నది దాటాల్సిందే

తాటితూరు పంచాయతీ వాసులలో ఎక్కువ మందికి నది అవతలే వ్యవసాయ భూములు, ఇటుక బట్టీలు, చేపల చెరువులు ఉన్నాయి. దీంతో వీటి యజమానులతో పాటు, అందులో పనిచేసే కూలీలు కూడా వందల సంఖ్యలో దాటుతూ ఉంటారు. వీరే కాకుండా నదిపై ఆధారపడి జీవించే పశువుల కాపరులు, చాకలి వృత్తిపై ఆధారపడేవారు నిత్యం నదిని దాటకుండా ఉండే పరిస్థితి లేదు. ఎగువన తాటిపూడి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల అయినప్పుడు, వర్షాలు కురిసిన సమయంలో తాటితూరుకు రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతుంటారు. మిగిలిన వారు అవసరమైతే కష్టమైనా, నష్టమైనా నదిని ఎలాగోలా దాటుతున్నా విద్యార్థులకు మాత్రం ప్రాణ సంకటంగా మారుతుంది. ఒక్కోసారి సమయం, డబ్బులు కలిసి వస్తాయని ద్విచక్ర వాహనాలను సైతం నీటిలో నుంచి దించి అవతలి ఒడ్డుకు చేరుకుంటారు.

కొట్టుకుపోయిన తాత్కాలిక మార్గం

ఇటీవల తాటితూరువాసులు నదిలో తాత్కాలికంగా గ్రావెల్, ఇసుక బస్తాలతో మార్గాన్ని ఏర్పాటు చేసినా చిన్నపాటి వర్షానికే ఇది ముంపునకు గురై కొట్టుకుపోతోంది. రెండు నెలల క్రితం అల్పపీడనానికి గోస్తని నది తాటితూరు జెడ్పీ హైస్కూల్ వరకు ప్రమాదకరంగా ప్రవహించింది. శాశ్వత ప్రాతిపదికన నదిపై తాటితూరు, సామియ్యవలస గ్రామాలను కలుపుతూ వంతెన లేదా చెక్ డ్యామ్ నిర్మించాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు.

అత్యంత ప్రమాదకర మార్గం

ప్రస్తుతం తాటితూరు నుంచి సామియ్యవలస వైపు నది గుండా రాకపోకలు సాగించే మార్గం అత్యంత ప్రమాదకరమైనది. గతంలో ఈ మార్గంలో వచ్చిన వరద అనేక మందిని నది పొట్టన పెట్టుకుంది. నదిలో ఓ మోస్తరుగా నీరు ఉన్నప్పుడు విద్యార్థులు పుస్తకాల బ్యాగులను నెత్తిన పెట్టుకుని గుంపులుగా దాటుతున్నా, వారు ఇంటికి చేరుకున్న వరకు తల్లిదండ్రులకు ప్రశాంతత ఉండదు. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా నదిలో గోతుల కారణంగా ప్రమాదాలు తప్పవు. నదిలో నీరు ఎక్కువగా ఉన్నప్పుడు కొందరు విద్యార్థులు రోజుకు రూ.50 వెచ్చించి సంగివలస, తగరపువలస మీదుగా ఆటోలపై హైస్కూల్‌కు చేరుకుంటారు. అంత వెచ్చించలేని వారు ఆ రోజుకు స్కూలుకు సెలవు పెట్టాల్సిందే.

బూట్లు, బట్టలు తడిచిపోతుంటాయి



బూట్లు, బట్టలు తడవకుండా నదిని దాటడం సాధ్యం కాదు. నడుం లోతు వరకు నీరు ఉన్నప్పుడు అబ్బాయిలు బట్టలు మార్చుకుని దాటుతున్నా అమ్మాయిలకు వీలు పడదు. దీంతో వారు పాఠశాలకు ఉండిపోతున్నారు.

– కోన చంద్రశేఖర్, 10వ తరగతి

కనీసం నడిచే దారీ లేదు



రోజూ నదిని దాటి రావాలంటే కష్టమవుతోంది. మాతో పాటు పెద్దవాళ్లు కూడా చాలా ఇబ్బంది పడుతున్నారు. మా కష్టాలను అర్థం చేసుకుని ప్రభుత్వం నడిచి వెళ్లేందుకు కనీసం చెక్‌డ్యామ్, చిన్న వంతెన ఏర్పాటు చేయాలి.

– బిల్లాన యువశ్రీ, 6వ తరగతి

మా కష్టాలు పట్టించుకోవాలి



మా పంచాయతీ హెడ్ క్వార్టర్ పొంద్రంకిలో జెడ్పీ హైస్కూల్ ఉన్నా.. నదికి అవతల ఉన్న భీమిలి మండలంలోని తాటితూరు హైస్కూలే మాకు దగ్గర. ఆనందపురం మండలం బోని హైస్కూల్‌కు రోడ్డు మార్గం ఉన్నా రవాణా వసతి లేక తాటితూరే వెళ్తుంటాం. కానీ వర్షం వస్తే మాత్రం చాలా కష్టమవుతోంది.

– రొంగలి సందీప్, 8వ తరగతి

ఆటోలకు డబ్బులు పెట్టుకుని వెళ్లలేం



మా పద్మనాభం మండలంలోని పొంద్రంగి, ఆనందపురం మండలంలోని బోని హైస్కూళ్లకు నది అడ్డంగా లేకపోయినా ఆటోలో ప్రయాణం డబ్బులతో పని. సిటీ బస్సు సదుపాయం లేదు. నదికి వరదలు వచ్చినప్పుడు కూడా తాటితూరు హైస్కూల్‌కు డబ్బులు కట్టుకుని ఆటోలో వెళ్లాలి. మా గ్రామంలోని తల్లిదండ్రులంతా కూలీలే. ఆటో ప్రయాణం కష్టం. నదిపై వంతెన నిర్మిస్తే మా కష్టాలు గట్టెక్కుతాయి.

– యజ్జాద తనూజ, 8వ తరగతి

రుషికొండ బీచ్ సౌత్ రహదారి పరిశీలన



రహదారిని పరిశీలిస్తున్న డీసీపీ నర్సింహమూర్తి, జిల్లా పర్యాటకశాఖ అధికారి జ్ఞానవేణి

కొమ్మాది: రుషికొండ బీచ్ సౌత్ రహదారిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని పర్యాటకశాఖ అధికారి జ్ఞానవేణి తెలిపారు. ఈ రహదారిని డీసీపీ అన్నెపు నరసింహ మూర్తితో కలసి ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుషికొండ బీచ్‌ను చూసేందుకు నిత్యం వేలాదిమంది పర్యాటకులు వస్తుంటారన్నారు. కార్తీకమాసం కావడంతో ఆ సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. బెంగాల్ పర్యాటకులు వచ్చే సీజన్ కూడా ప్రారంభమైందని, వీటిని దృష్టిలో పెట్టుకుని సౌత్ రహదారిని తెరిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీటి వలన ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు పరిష్కరించే విధంగా ఉంటుందన్నారు. కొండవైపు ఉన్న ఫెన్సింగ్, లైటింగ్ మెరుగుపరిచే విషయాలపై జీవీఎంసీ అధికారులతో చర్చిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రైవేట్ సెక్యూరిటీ పెంచే అంశాన్ని కూడా పర్యాటక శాఖ పరిశీలిస్తోందన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల బరితెగింపు



పంచాయతీ కేటాయించిన రోడ్డుకంటే రియల్ ఎస్టేట్ సంస్థ ఏర్పాటు చేసుకున్న రెట్టింపు దారి



రియల్ ఎస్టేట్ సంస్థల నిర్వాకంతో చెరువు, శ్మశానవాటిక ఆక్రమణకు గురైన ప్రాంతం

- శ్మశానవాటిక, చెరువు కప్పేసి, రోడ్డు విస్తరణ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస పంచాయతీ సర్వే నంబర్ 119/1లో ఊర చెరువు, శ్మశానవాటికలు ఆక్రమణకు గురవుతున్నాయి. 15 ఏళ్ల క్రితం మజ్జివలస–పద్మనాభం రహదారిని ఆనుకుని రెడ్డివారి కళ్లాల వైపు కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయభూములు కొనుక్కుని ప్లాట్లు వేసి విక్రయించారు. ఆ సమయంలో పంచాయతీకి చెందిన ఎస్సీ, బీసీ సామాజిక వర్గాల వారు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తోవ నిమిత్తం తమ శ్మశానవాటిక, చెరువు మధ్య నుంచి 12 అడుగుల స్థలాన్ని కేటాయించారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలు కూడా రాసుకున్నారు. ఇటీవల భీమిలి మండలానికి చెందిన కొందరు నాయకుల జోక్యంతో సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరితెగించి శ్మశానవాటిక, చెరువులను కప్పేస్తూ 12 అడుగుల రహదారిని 30 అడుగులకు విస్తరించారు. వారు వేసిన ప్లాట్లకు సంబంధించి లోపల అన్నీ 10 అడుగుల రహదారులు ఉండగా మజ్జివలస–పద్మనాభం రహదారిని ఆనుకుని 30 అడుగులకు విస్తరించడంపై స్థానిక పంచాయతీ వాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కేవలం స్వార్థంతో కొందరు నాయకుల అండ చూసుకునే రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువు, శ్మశానవాటికల ఆక్రమణకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక సచివాలయ వీఆర్వో, సర్వేయర్ పరిశీలించి ఆక్రమణకు గురైన ప్రాంతం గ్రామకంఠానికి చెందినదని తెలిపారు. దీనిని భీమిలి తహసీల్దార్ దృష్టికి తీసుకు వెళతామన్నారు.

బాల త్రిపుర సుందరి సన్నిధిలో దీపోత్సవం



ఆలయ వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పద్మనాభం: పద్మనాభం పంచాయతీ ఇసుకలపాలెంలో గోస్తని నది తీరాన ఉన్న బాల త్రిపుర సుందరి ఆలయంలో కార్తీక దీపోత్సవం గురువారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం దీపం వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త బుల్లిరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమన్వయంతో దీపోత్సవం విజయవంతం

పద్మనాభం: అందరూ సమన్వయంతో పని చేసి, దీపోత్సవం విజయవంతం చేయాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు కోరారు. ఈ నెల 30న జరగనున్న అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం సందర్భంగా కుంతీ మాధవ స్వామి ఆలయ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు..ఈవో నానాజీబాబు, తాలాడ పద్మనాభం, నగేష్ కుమార్ పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం నేడు

తగరపువలస: ఆనందపురం మండలంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయ 38వ వార్షిక వేడుకలు శుక్రవారం నిర్వహించనున్నట్లు అర్చకుడు చావలి శ్రీనివాస శర్మ, ఆలయ ధర్మకర్త బి.జగన్ తెలిపారు. అమ్మవారికి 1008 చామంతి, గులాబీ పువ్వులతో సహస్ర నామార్చన, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

పీఎం పాలెం: కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్‌కు చెందిన 11 కేవీ సేవానగర్ ఫీడర్ పరిధిలో లైన్ల నిర్వహణ, మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విశాఖ జోన్–3 ఆపరేషన్స్ డీఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా కొమ్మాది జంక్షన్, శ్రీనివాసనగర్, సాయిరామ్ కాలనీ, జీసీసీ లేఅవుట్, టీచర్స్ లే అవుట్, అమరావతి కాలనీ, సూర్యాపేపర్, సాయిరామ్ కాలనీ, వెంకట్ ఎస్సీ కాలనీ, మాస్టర్ స్కూల్ ఏరియాలలో ప్రకటించిన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

పద్మనాభంలో..

పద్మనాభం: పద్మనాభం సబ్ స్టేషన్ పరిధిలోని గంధవరం, పద్మనాభం టౌన్, సిర్లపాలెం ఫీడర్ల నిర్వహణ, లైన్లకు మరమ్మతులు చేపట్టనున్నందున ఆ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖపట్నం ఆపరేషన్స్ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పద్మనాభం, ఇసకలపాలెం, మద్ది, విలాస్కాన్‌పాలెం, అనంతవరం, పెంట, కొవ్వాడ, విజయరాంపురం, గంధవరం, కృష్ణాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

మహా అన్నసమారాధన



అన్నసమారాధన చేస్తున్న అర్చకులు

తగరపువలస: కార్తీకమాసం సందర్భంగా గురువారం చిట్టివలస జ్యూట్‌మిల్లు షిర్డీసాయిబాబా ఆలయంలో అర్చకులు ఆకెళ్ల భాగ్యరాజా, రవిగణేష్‌ల ఆధ్వర్యంలో మహా అన్నసమారాధన జరిగింది. ఇందులో పాల్గొన్న భక్తులు ఉసిరి చెట్ల కింద కూర్చుని ప్రసాదాలను స్వీకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని సహాయ, సహకారాలు అందించారు. కార్యక్రమంలో మేకల శ్రీను, కొల్లి వెంకటరమణ, జల్దు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుదాం



ఎంపీడీవోకు టేబుల్ టాప్ అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

తగరపువలస: పర్యావరణాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని, దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిద్దామని ఆనందపురం ఎంపీడీవో వి.జానకి అన్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే టేబుల్ టాప్‌ను గ్రీన్ లీవ్స్ ప్రతినిధులు గురువారం ఆమెకు బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కల పెంపకం ఆవశ్యకత తెలియజేసే ఇలాంటి ప్రేరణాత్మక చిత్రాలను అన్ని కార్యాలయాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మన భవిష్యత్తు కార్యాచరణను అవి గుర్తు చేస్తాయన్నారు.

మెగా పేరెంట్స్ డే ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు

భీమునిపట్నం: డిసెంబర్ ఏడో తేదీన నిర్వహించనున్న మెగా పేరెంట్స్ డే కార్యక్రమం విజయవంతమయ్యేలా అందరూ సహకారం అందించాలని జిల్లా ఉప విద్యా శాఖాధికారి ఎ.సోమేశ్వరరావు సూచించారు. మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కచ్చితంగా పాల్గొనేలా చూడాలన్నారు. పూర్వ విద్యార్థులను, విద్యావేత్తలను ఆహ్వానించి, విద్యార్థులకు సూచనలు ఇచ్చేవిధంగా చూడాలని, ఇది వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులకు పోటీలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు జయప్రద, శివరాణి, ఎంపీడీవో హనుమంతరావు, అధికారులు పాల్గొన్నారు.

వ్యర్థాలను శుద్ధి చేసి వినియోగించే సాంకేతికత అవసరం

- కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డా. కృష్ణయ్య



27టిఏిఎల్54: ప్రసంగిస్తున్న డా. కృష్ణయ్య

కొమ్మాది: వ్యర్థాలను శుద్ధి చేసి, తిరిగి వినియోగించే విధంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డా. పి. కృష్ణయ్య సూచించారు. ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఎయిర్ అండ్ వాటర్ సంస్థ సంయుక్తంగా వ్యర్థాల నిర్వహణ సర్క్యులర్ ఎకానమీపై గీతంలో నిర్వహిస్తున్న 14వ అంతర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. వ్యర్థాల నుంచి సంపదను సృష్టించే సర్క్యులర్ ఎకానమీ విధానంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాయన్నారు. వ్యర్థాలను సమర్థవంతంగా శుద్ధి చేసి, ప్రయోజనకరంగా మార్చే పరిజ్ఞానం అభివృద్ధి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భీమునిపట్నం: జ్యోతిరావు పూలే గొప్ప సంఘసంస్కర్త అని, ఆయన చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్‌సీపీ మూడో వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా భీమిలిలోని మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. నాయకులు కదిరి ఎల్లాజీ, వాసుపల్లి కొండబాబు, ప్రభాకర్‌నాయుడు, కోండ్రు రామసూరప్పడు, ఎర్రయ్యరెడ్డి, బాకి రమణారెడ్డి, నాగేంద్ర, సీహెచ్ గౌరినాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధే లక్ష్యం

- సౌర విద్యుత్‌ను ప్రోత్సహిస్తే ఇది సాధ్యం
- అత్యధిక పునరుత్పాదక ఇంధన సరఫరా గ్రామాలకు ప్రోత్సాహకాలు
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

తగరపువలస: సౌర విద్యుత్‌ను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ అవసరాల కోసం స్వయం సమృద్ధి సాధించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆకాంక్షించారు. ఈ విధంగా దేశంలోని ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచేలా చేయడమే లక్ష్యమన్నారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సౌరశక్తి వినియోగాన్ని పెంచే అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఎం సూర్యఘర్ యోజన ద్వారా అత్యధిక పునరుత్పాదక ఇంధన సరఫరా గ్రామాల్లో విజేతగా నిలిచిన వారికి కేంద్ర ప్రభుత్వం రూ.కోటి వంతున నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇందుకు గాను ప్రతిపాదిత నమూనా సౌరగ్రామాలుగా చిప్పాడ, గంభీరం, ఆనందపురం, ఆర్. తాళ్లవలస, వెల్లంకి, రెడ్డిపల్లి గ్రామాలను ఎంపిక చేశారన్నారు.

పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని రాష్ట్ర పునరుత్పాదక ఇంధనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో కమిటీలు ఆరు నెలల పాటు మదింపు చేస్తాయన్నారు. విజేత గ్రామాలలో విద్యుత్ కనెక్షన్లు అమర్చుకునేందుకు ఒక్కో కనెక్షన్‌కు రూ.1000 ప్రోత్సాహకం అందిస్తారన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కనెక్షన్లు తీసుకునేవారికి ఆర్థిక భారం తగ్గి మిగులు విద్యుత్ కారణంగా మరింత ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందన్నారు. విశాఖ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ శ్యాంబాబు, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్, సర్పంచ్ చందక లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, ఎంపీడీవో జానకి, వివిధ బ్యాంకుల అధికారులు,మూడు మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు,సోలార్ వెండార్లు పాల్గొన్నారు.